# తండ్రి గారి సందేశం....



## శోధనలను జయించడానికి ఆయుధం దేవుని వాక్యం

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

యేసు తన బహిరంగ జీవితం ప్రారంభించే ముందు ఎడారిలో 40 రోజులు ఉపవాసముండి ప్రార్థించాడు. అప్పుడు యేసుకు ఆకలైంది. ఆ సమయములో సైతాను యేసుని సమీపించి ''నీవు దేవుని కుమారుడవైనచో ఈ రాళ్లను రొట్టెలుగా మార్చుము" అన్నాడు. తనలో ఉన్న దైవీకశక్తి స్వంతం అవసరానికి ఉపయోగించుకొనుటకు ఇది ప్రేరేపణ. స్వంత అవసరానికి గల ఈ శోధనను యేసు పరిశుద్ధ వాక్యంతో జయించాడు. "మానవుడు కేవలము రొట్టెవలననే జీవింపడు కాని దేవుడు వచించు ప్రతి వాక్కు వలన జీవించును అని వ్రాయబడియున్నది''. అని యేసు అన్నాడు (మత్తయి 4,4).

పిమ్మట సైతాను ఆయనను పరిశుద్ధ నగరములోని దేవాలయ శిఖరమున నిలిపి, రెండవ మారు శోధించింది. "నీవు దేవుని కుమారుడైనచో ఈ శిఖరము నుండి క్రిందికి దుముకుము. నిన్ను గూర్చి దేవుడు తన దూతలకు ఆజ్ఞ ఇచ్చును. రాళ్ల పైబడి గాయపడకుండునట్లు నిన్ను వారు తమ చేతులతో ఎత్తిపట్టుకుంటారు" కాని "ప్రభువునైన నీ దేవుని నీవు శోధింపరాదు అని లేఖనమున వ్రాయబడియున్నది" (మత్తయి 4,7) అనే వాక్యంతో ఆ శోధనను జయించాడు.

"మరల సైతాను యేసును మిక్కిలి ఎత్తయిన పర్వత శిఖరమున చేర్చి, భువియందలి రాజ్యములను అన్నిటిని, వాని వైభవమును చూపి నీవు సాష్టాంగపడి నన్ను ఆరాధించిన ఎడల నీకు ఈ సమస్తమును ఇచ్చెదను'' అన్నాడు. ఈ లోక సంపదలు, గొప్ప స్థానములు పొందుటకు గల ఈ శోధనను ఆయన జయించాడు. "సైతానూ! పొమ్ము! ప్రభువైన నీ దేవుని ఆరాధింపుము. ఆయనను మాత్రమే సేవింపుము అని వ్రాయబడియున్నది" అని యేసు పలికాడు (మత్తయి 4,10). అప్పుడు సైతాను ఆయనను విడిచి పోయింది. సంపద, అధికారం, సుఖజీవితం – వీటి కొరకు యేసు శోధింపబడ్డాడు. మన జీవితములో కూడ ఇలాంటి శోధనలు రావచ్చు. అప్పుడు యేసువలే మనము దానిని జయించాలి. ఉపవాసము, ప్రార్థన, వాక్యము ద్వారా ఆత్మశక్తి పొందియున్నందుకు యేసుకు శోధనలను జయించుటకు శక్తి వచ్చింది. దైవపుత్రుడైన యేసును శోధించిన సైతాను మనలను కూడ శోధించుటకు వివిధ రీతిలో వస్తాడు. "మీ శత్రువగు సైతాను గర్జించు సింహమువలె తిరుగుచు ఎవరినేని గబళింప చూచుచున్నాడు" అని పునీత పేతురు మనతో చెప్తున్నాడు (1 పేతురు 5,8). శోధనలను

జయించడానికి ఉపవాసం, ప్రార్థన, దేవుని వాక్యం మనకు దోహదపడుతుంది.

**దైవవాక్కుపై ఆధారపడిన జీవితం**

శోధనలను జయించుటకు మనకు శక్తి నిచ్చేది దైవవచనమే. "నేను నీకు ద్రోహముగా పాపము చేయకుండుటకు గాను నీ వాక్యమును నా హృదయమున నిల్పుకొంటిని" (కీర్తన 119,11) అని కీర్తన కారుడు చెప్తున్నాడు. దైవ వచనం పాపమార్గము నుండి మనలని రక్షించి. అది మనలను శుద్ధీకరిస్తుంది (యోహాను 15,3). "సత్యము నందు వారిని ప్రతిష్ఠించుము, నీ వాక్కు సత్యము" అని యేసు శిష్యుల కొరకు తండ్రితో ప్రార్థించాడు (యోహాను 17,17). ప్రతి దినం దైవవచనం చదివి దానిలో చెప్పినట్లు జీవిస్తే మనం పాపములో పడిపోము. దేవుని వచనం "నా పాదములకు దీపము, నా త్రోవకు వెలుగు" (119,105). దైవవచనం చదివి, ధ్యానించి, దానిలో చెప్పినట్లు, జీవించేవాడు రాయి మీద ఇల్లు కట్టిన వివేకవంతుడైన మనిషికి సమానం (మత్తయి 7,24). ఏ ఇబ్బందులు వచ్చినా గానీ నిరాశ చెందకుండా నిరీక్షణతో జీవించుటకు దైవవాక్కుపై ఆధారపడిన జీవితం మనకు శక్తినిస్తుంది. ప్రతి మానవమాత్రుడి యొక్క అతి ముఖ్యమైన బలహీనతలు ఏమిటో, మనల్ని తన వశంలో ఎలా ఉంచుకోవాలో కుమారుడైన యేసు ప్రభును సైతాను శోధించిన శోధనలను జయించి మనల్ని మనం శుద్ధీకరించుకోవడానికి ఈ తపస్సు కాలం గొప్ప అవకాశమని మనం గ్రహించాలి.

ప్రియ సహోదరీ సహోదరులారా! యేసు ప్రభు ఏ విధంగా దేవుని వాక్యం ద్వారా శోధనలను జయించాడో ఆయన పొందిన శోధనలను బట్టి మనకు అర్థం అవుతుంది. కాబట్టి మనం మన అనుదిన జీవితంలో దేవుని వాక్యాన్ని ఆధారంగా చేసుకొని ముందుకు సాగుదాం. ఆ విధంగా మన జీవితంలో ఎదురయ్యే అన్ని శోధనలను ఎదురుకుందాం. సైతాను పన్నే అన్ని పన్నాగముల నుండి మనలను విడిపించడానికి దేవుని శక్తి ఎంతో తోడ్పడుతుంది. కాబట్టి ఈ తపస్సు కాలములో ప్రత్యేకముగా మనం దేవుని వాక్యాన్ని చదవడానికి సమయం కేటాయిద్దాం. దేవుని వాక్యాన్ని చదవడానికి అదే విధంగా పాటించడానికి శాయ శక్తులా మనం ప్రయత్నిద్దాం. ఆ విధంగా తపస్సు కాలము మనకు, మన కుటుంబానికి ఆశీర్వాదకరంగా మారడానికి మనమందరం ప్రయత్నిద్దాం. దేవుని వాక్యం మనందరినికి శక్తి నిచ్చును గాక! ఆమెన్.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు